# దొరకునా..

'అబ్బా, మరీ ఇంత లేటా. పొద్దున్న పదింటికల్లా రమ్మంటే ఇప్పుడు మధ్యాహ్నం మూడైంది. ఇంకా అడ్రస్ లేరు..' నాలో నేను తిట్టుకుంటూ బాల్కనీలోంచి హాల్లోకి నడిచాను.

నా పేరు మాధవ. నేను, మహేష్, మురళి, రాఘవ చిన్ననాటి స్నేహితులం. కలిసి చదువుకున్నాం. నాలుగేళ్ళ క్రితం కలిసి అమెరికా వచ్చాం. ఇక్కడ ఎంటెక్ చేసి అందరం కాలిఫోర్నియాలోనే వేరు వేరు చోట్ల ఉద్యోగాలు చేస్తున్నాం. రేపు ఆదివారం నాకొక ముఖ్యమైన పని ఉంది. దాని గురించి డిస్కస్ చేయడానికే వీళ్ళని ఈ వీకెండ్‌కి నా దగ్గరికి పిలిచాను. ఆ పని మీద నేను రేపు పొద్దున్నే బయలుదేరి వెళ్ళాలి. అందుకే వీళ్ళని ఈరోజు త్వరగా రమ్మని చెప్పాను. మహేష్ చెప్పిన టైముకే వచ్చాడు. రాఘవ, మురళిలే లేటు.

'ఒరే, ఇది పదోసారి. ఇంకా అరగంటలో ఇక్కడ ఉంటామని ఇప్పుడేనా కాల్ చేసారు? కంగారు పడకు. అయినా నువ్వు చెప్పే ఆ న్యూస్ ఏమిటోనని మేము టెన్షన్ పడాలి కానీ నీకెందుకురా టెన్షన్? నీకొకటి చెప్పనా? నాకొక మంచి ఐడియా వచ్చింది. ఆ న్యూస్ ఏమిటో ముందు నాకు చెప్పేయి. నీ బరువు సగం తగ్గుతుంది. ఈలోపు వాళ్ళు కూడా వచ్చేస్తారు. ఏమంటావు?' 'ఇలాంటి ఐడియా ఈ మధ్య కాలంలో విన్నావా..' అన్నట్టు మొహం పెట్టి నవ్వుతూ నా వైపు చూసాడు మహేష్, ఎదురుగా ఉన్న టీపాయ్ మీద కాళ్ళు పెట్టుకు కూర్చుని.

'నాకు టెన్షన్‌గా లేదు, కోపంగా ఉంది. టెన్షన్ తగ్గడానికైతే నీ సలహా బాగానే ఉంది. మరి కోపం తగ్గడానికి నాకో ఐడియా ఉంది..' అని సడెన్‌గా ఆ టీపాయ్‌ని ముందుకి నెట్టాను. ధబ్ మని మహేష్ రెండు కాళ్ళూ ఒకేసారి కింద పడ్డాయి. 'దీనికంటే నా ఐడియానే బాగుంది..' అన్నట్టు నా వైపు చిరుకోపంతో చూసాడు మహేష్.

ఇంకో ఇరవై నిమిషాలు గడిచాకా మురళి, రాఘవ వచ్చారు.

వస్తూనే మురళి అందుకున్నాడు. 'నాకేం సంబంధం లేదు. నేను కేవలం ప్యాసింజర్‌ని మాత్రమే. మీ తిట్లన్నీ వంద మైళ్ళ దూరానికి మూడు గంటలు తీసుకున్న సూపర్ ఫాస్ట్ డ్రైవర్ రాఘవ గారికే చెందుతాయి.', అన్నాడు మహేష్ పక్కన సోఫాలో కూర్చుంటూ.

రాఘవ చిరునవ్వుతో 'ఆఁ, మరి ఈ కాస్త దూరానికే ఆకలో ఆకలో అంటూ రెండు సార్లు కారు ఆపించిందెవరో?' అని మహేష్‌కి హాయ్ చెప్పి నా భుజం మీద చెయ్యి వేసి 'ఏరా మాధవా, ఇప్పుడు చెప్పు. ఏంటా బిగ్ న్యూస్? మేము టెన్షన్ తట్టుకోలేకపోతున్నాము.' అన్నాడు.

టెన్షన్ అన్న మాట వినగానే చివాలున తల తిప్పి నా వైపు చూసాడు మహేష్ ఇందాక నేను చేసిన పని గుర్తుకువచ్చి.

నేను కూడా నవ్వుతూ 'ముందు మీరు ఫ్రెష్ అవ్వండ్రా. టీ తాగుతూ మాట్లాడుకుందాం.' అన్నాను.

-:రెండు గంటల తర్వాత:-

నేను రెండు చేతుల మధ్య ముఖం పెట్టుకుని కూర్చున్నాను. మహేష్ ఖాళీ టీ కప్పు గడ్డం మీద పెట్టుకుని కింద పడకుండా బ్యాలన్స్ చేస్తున్నాడు. రాఘవ తలుపు దగ్గర చేతులు కట్టుకు నిల్చొని ఆకాశంలోకి చూస్తున్నాడు. మురళి నేల మీద పడుకుని సోఫాలో కాళ్ళు పెట్టుకున్నాడు.

సడెన్‌గా ఏదో బద్దలైన శబ్దం వచ్చింది. మహేష్ నా వైపు చూసి 'హిహిహి.. అంటే ఎప్పుడూ కింద పడేది కానీ పగిలేది కాదు. ఈ కప్పు మరీ వీక్‌గా ఉంది.' అని తప్పు కప్పు మీదకి నెట్టేసి అక్కడ శుభ్రం చెయ్యడం మొదలు పెట్టాడు.

రాఘవ నా వైపు చూసి మాట్లాడటం మొదలుపెట్టాడు. 'నీకసలు ఎప్పుడు చెప్పారు?'

'రెండు రోజుల క్రితం.'

'పరీక్షల టైంటేబుల్ రెండు నెలల ముందు వస్తేనే మనం అంతంత మాత్రం. అలాంటిది ఇంత ముఖ్యమైన విషయానికి ఇంత తక్కువ టైమంటే..'

'కష్టమే! కానీ నా ప్రయత్నం నేను చెయ్యాలి. ఇంట్లో వాళ్ళు చాలా నమ్మకంతో ఉన్నారు.'

'అది సరే గానీ ఇంతకీ రేపు ప్రోగ్రాం ఏమిటి?' అడిగాడు మురళి.
'ఏమో తెలియదు. ఇక్కడనుంచి తొమ్మిదింటికల్లా బయలుదేరదామనుకుంటున్నాను. అదొక్కటే తెలుసు ప్రస్తుతానికి.'
'కంగారు పడకురా. చూద్దాం ఏం జరుగుతుందో. రిలాక్స్ అవ్వు.' అన్నాడు రాఘవ.
మా మాటల మధ్య తన పని ముగించి వచ్చి బుద్ధిగా కూర్చున్నాడు మహేష్. ఐదు నిమిషాలు నిశ్శబ్దంగా గడిచాయి. ఉన్నట్టుండి మహేష్ గట్టిగా 'ఒరేయ్, నాకొక మంచి ఐడియా వచ్చింది. ఇది పాటించావంటే నీ కంగారు మొత్తం దూరం అయిపోతుంది.' అన్నాడు.
మేం ముగ్గురుం ఒకళ్ళ మొహాలు ఒకళ్ళు చూసుకుని తన వైపు చూసాం. 'మౌనం పూర్తి అంగీకారం' అనుకుని చెప్పడం మొదలు పెట్టాడు మహేష్.
'ఏం లేదురా. ఇప్పుడు మనం ఏదైనా ఎగ్జామ్‌కి ప్రిపేర్ అవ్వాలనుకో, ఏం చేస్తాం? ఏది పడితే అది చదివేయం కదా. ముందు సిలబస్ ఏమిటో చూస్తాం. పాత ఎగ్జామ్ పేపర్స్ చూస్తాం. ఇంపార్టెంట్ క్వశ్చన్స్ నోట్ చేసుకుంటాం. అప్పుడు గంటో, రెండు గంటలో చదివి ఎగ్జామ్ వ్రాస్తాం. అవునా?'
'ఏంట్రా నీ గోల?' అన్నాడు మురళి అసలు మహేష్ చెప్పేది వినకుండా.
'అసలు వీడిని ఎవరు మాట్లాడనిచ్చార్రా?' అసహనంగా అడిగాడు రాఘవ.
'ఒరే, నన్నంత తేలిగ్గా తీసుకోకండిరా. "బైబిల్‌ని విమర్శించడానికి ముందు దాన్ని పూర్తిగా చదువు." అన్నారు పెద్దలు.' అన్నాడు మహేష్.
'ఈ మాత్రానికే బైబిల్ దాకా ఎందుకులే. కానీ.' అన్నాడు రాఘవ.
నేను నిశ్శబ్దంగా చూస్తూ ఉన్నాను.
మహేష్ చెప్పడం కంటిన్యూ చేసాడు. 'అదేరా. నీలో ఇప్పుడు చాలా సందేహాలున్నాయి కదా. ఏం మాట్లాడాలి, ఎలా మాట్లాడాలి, ఎంతసేపు మాట్లాడాలి.. ఇలా ఎన్నో. వాటిలో కొన్నిటికైనా సరిగ్గా ప్రిపేర్ అవ్వాలంటే నువ్వొక పని చెయ్యాలి.'
నేను ఏమిటన్నట్టు చూసాను.
'ఫోన్ చెయ్యాలి.' చెప్పడం ముగించాడు మహేష్.
'థ్యాంక్స్. చాలా మంచి సలహా.' వ్యంగ్యంగా అన్నాడు మురళి.
వెంటనే రాఘవ. 'లేదు, లేదు. వాడు చెప్పేది కరెక్టే అనిపిస్తోంది నాకు. మనకి రాత్రంతా టైం ఉంది. ఒక ఎగ్జామ్‌కి ప్రిపేర్ అయ్యే టైంకంటే ఎక్కువే ఉంది. కాకపోతే సిలబస్ తెలియాలి.' అని నా వైపు చూసి 'అది తెలుసుకోవడానికి ఫోన్ చెయ్యడం చాలా మంచి ఆలోచన.' అన్నాడు.
నేను ఆలోచిస్తున్నట్టు మొహం పెట్టాను. అది చూసి మహేష్ నాకు నచ్చచెప్పాలనుకుంటా 'దెబ్బలు తినడం తప్పదన్నప్పుడు రెండు దఫాలుగా తినే అవకాశం వస్తే నేనైతే వదులుకోను.' అన్నాడు.
వాడి మాటలకి నాకు అంత ఆలోచనల్లోనూ నవ్వొచ్చింది. నేను 'అలాగేలే' అనేలోపు మురళి అందుకున్నాడు.
'ఒరే, ఇంత చెత్త డైలాగ్ నేను పుట్టాకా వినలేదు. ఎవడైనా దెబ్బలు తినే పరిస్థితి వస్తే ఒక్కసారే తినేసి అక్కడినుంచి పారిపోవాలని చూస్తాడు కానీ నీలా రేపు కూడా వస్తాను. ఇక్కడే ఉంటారుగా అని అడగడు.'
'నీకంతే అర్థమయ్యింది. రెండు దఫాలుగా తినడం అంటే ఒకేసారి తినే బదులు సగం సగం రెండుసార్లు తినడం అని. అంతేగానీ నువ్వనుకున్నట్టు ఫుల్‌గా తినేసి, మళ్ళీ మర్నాడు వెళ్ళడం కాదు.' అని కోపంగా సమాధానం చెప్పాడు మహేష్.
'అలాగా బాబు! నాకు తెలియదులే. నీ అంత బుర్ర నాకెక్కడిది?' వ్యంగ్యంగా అన్నాడు మురళి.
'అదే నేననేది కూడా. చిన్నప్పుడు ఎప్పుడో ఎదగడం ఆగిపోయింది పాపం.' అంతే వ్యంగ్యంగా తిరగేసాడు మహేష్.
'నా బుర్ర కొంచెం ఎదిగి ఆగిందేమో. నీదసలు పుట్టాకా ఎదగనే లేదు. నువ్వూ, నీ చెత్త సలహాలు.' ఇంకా సాగదీసాడు మురళి.
'ఒరే, నువ్వొక్కడివే ఇది చెత్త సలహా అంటున్నది. అది కూడా నీకర్థంకాక. ఐనా నచ్చాల్సింది నీక్కాదురా.

మాధవకి. వాడికి నచ్చింది. అంతే.' సింపుల్ గా తేల్చేసాడు మహేష్. మురళి మాత్రం చివరి మాట తనదే అవ్వాలనుకున్నట్టున్నాడు. మళ్ళీ అందుకుంటూ 'ఒరే, నీ ఖాళీ బుర్రలో అటూ ఇటూ గాలికి తిరుగుతున్న ఒక్కగానొక్క ఐడియాని బయటకి తీసి పెద్ద మేధావిలా ఫోజు కొట్టకు. ఇలాంటి ఐడియాలు పావలాకి పాతిక బయట.' అన్నాడు.

మళ్ళీ మహేష్ ఏదో అనబోతుండగా రాఘవ అందుకుంటూ 'ఒరే మేధావుల్లారా. ఇద్దరూ నోళ్ళు ముయ్యండి. మీ మాటలు వింటోంటే మాకు సిగ్గేస్తోంది.' అన్నాడు.

కానీ నిజం చెప్పాలంటే వాళ్ళ గోల వల్ల నా మనసు కొంచెం తేలిక పడింది.

పది నిమిషాలు నిశ్శబ్దంగా గడిచాయి. ఉండుండి ఒకసారి మహేష్, మురళి ఒకళ్ళనొకళ్ళు తినేసేలా చూసుకుంటున్నారు. కాసేపాగి నేనే అన్నాను. 'సరేరా. ఫోన్ చేద్దాం.'

ఆ మాట వింటూనే ఒక్క ఉదుటన లేచి స్పీకర్ ఫోన్ తెచ్చి టీ పాయ్ మీద పెట్టాడు మహేష్. నేను ఆశ్చర్యపోతూ 'ఇదెందుకురా, సెల్ ఫోన్లో మాట్లాడతా.' అన్నాను. విచిత్రంగా ముగ్గురూ ఒకేసారి 'కుదరదు' అన్నారు, చాలా గట్టిగా. నాకు నవ్వొచ్చింది. నవ్వాపుకుంటూ 'అలా కాదురా. ఫోన్ అయ్యేవరకు మాట్లాడకుండా ఉండడం మీ వల్ల కాదు. మధ్యలో ఎవరైనా నోరు జారితే బాగోదు.' అన్నాను.

రాఘవ మాట్లాడుతూ 'అలా ఏమీ జరగదులేరా. మేమేమీ చిన్న పిల్లలం కాదు కదా!' అన్నాడు.

ఆ మాటకి సమాధానంగా అనుకుంటా మురళి మహేష్ వైపు చూసాడు. మహేష్ ఆ చూపు అర్థం కానట్టుగా తల తిప్పుకున్నాడు.

కొద్ది నిమిషాలు గడిచాయి. 'చెయ్యి మరి.' ఫోన్ వైపు చూపిస్తూ అన్నాడు మహేష్.

'అదే, ఏం మాట్లాడాలా అని..' అన్నాను నేను.

'నీకే తెలుస్తుంది ఆటోమాటిగ్గా. ముందు డయల్ చెయ్యి.' అన్నాడు రాఘవ.

సరేనని నంబర్ డయల్ చేసాను. 'రింగవుతోంది. రింగవుతోంది.' అంటూ ఉత్సాహపడ్డాడు మహేష్.

'దిసీజ్ మహతి.' అవతలి నుండి ఒక గొంతు వినిపించింది. నా గుండె దడ దడా కొట్టుకుంటోంది. అంత దడలోనూ గుర్తించాను ఆమె గొంతు చాలా బాగుందని.

మహతి - మా ఇంట్లో వాళ్ళు చూసి రమ్మని చెప్పిన అమ్మాయి. రేపు నాకున్న అతి ముఖ్యమైన పని ఆ అమ్మాయిని కలవడమే. తను మా వూరికి పాతిక మైళ్ళ దూరంలో ఉన్న ఒక యూనివర్సిటీలో ఫిలాసఫీ స్టూడెంట్. నాకు తెలిసినవాళ్ళలో ఫిలాసఫీలో డిగ్రీలు చేసినవాళ్ళెవరూ లేరు. ఫిలాసఫీ గొప్పదే. కానీ నా భయమల్లా ఆ అమ్మాయి ఇంత చిన్న వయసులో ఫిలాసఫీ వైపు ఆకర్షితురాలవడం గురించి. సాధారణంగా ఫిలాసఫీ బాధ నుండి పుడుతుందంటారు. కానీ పాతికేళ్ళ వయసులో ఫిలాసఫీని నేర్చుకోవడం ఎంతవరకు సాధ్యమో, నిజం చెప్పాలంటే ఎంతవరకు కరెక్టో నాకు తెలియదు. ఒక ఫిలాసఫర్‌తో జీవితం ఎలా ఉంటుందో కూడా నాకు తెలియదు. ఇదే మాట మా అన్నయ్యతో అంటే తను చాలా సింపుల్‌గా తేల్చేసాడు - 'జరగాలని రాసిపెట్టి ఉన్నదాన్ని నువ్వు ఆపలేవు. జరగబోని దాని గురించి ఎంత తాపత్రయ పడినా ఉపయోగం లేదు. జరగకూడని దాన్ని ఆపే ప్రయత్నమైతే చెయ్యొచ్చు. ఇది జరగకూడనిదైతే ఇప్పుడే చెప్పు. జరగకూడదని నువ్వనుకుంటున్నదైతే ఆ అమ్మాయిని కలిసాక చెప్పు.' అని. ఇంత సడెన్‌గా ఈయనకి ఇంత ఫిలాసఫీ ఎక్కడి నుంచి వచ్చిందా అని నవ్వుకున్నాను నేను. అన్నట్టు అన్నయ్యకి ఈ మధ్యే పెళ్ళయింది.

'హెలో, ఎనీబడీ దేర్?' ఆలోచనల్లో మునిగిపోయిన నన్ను తన స్వరం మళ్ళీ పలకరించింది. వెంటనే తేరుకుని మాట్లాడటం మొదలు పెట్టాను.

'మహతి, నేనండి. మాధవ.'

'మాధవ..? ఓ మీరా! నమస్తే అండి. బాగున్నారా?'

ఆ 'నమస్తే' ఊహించనిదవ్వడంవల్లనేమో చాలా ఆనందంగా అనిపించింది. వీళ్ళకి కూడా ఆ నమస్తే నచ్చినట్టుగా అన్ని పళ్ళూ బయట పెట్టారు. ఆనందంగా మాట్లాడటం కంటిన్యూ చేసాను.

'ఆఁ బాగున్నానండి. మీరెలా ఉన్నారు?'

'బాగున్నా.. బాగున్నా. రేపు మన మీటింగ్ ఉన్నట్టుంది కదా.'

'అవునండి. అదే, అసలు ప్రోగ్రాం ఏమిటో డిస్కస్ చేద్దామని కాల్ చేసాను. మీరేమైనా అనుకున్నారా?'
'స్పెసిఫిక్‌గా ఐతే అనుకోలేదండి. మాట్లాడుకుంటూ ఉంటే అదే తెలుస్తుందని అనుకున్నా. మీకేమైనా ఆలోచన ఉందా?'
'అబ్బే లేదండి. నేనూ అదే అనుకున్నా. సరే ఐతే, రేపు పది లోపు అక్కడుంటా.'
'సరేనండి. సీయు టుమారో. గుడ్ నైట్.' అని ఫోన్ పెట్టేసింది.
ఫోన్ పెట్టేసి వీళ్ళవైపు చూసాను. ముగ్గురూ నావైపు గుర్రుగా చూస్తున్నారు.
'అదేంట్రా, అప్పుడే పెట్టేసావు?' అడిగాడు మురళి.
'నేనెక్కడ పెట్టాన్రా? ఆ అమ్మాయే కదా సీయు టుమారో అంది?'
'నీ మాటల వల్లే ఆ అమ్మాయి అలా అంది.' కోపంగా అన్నాడు మహేష్.
'సరే సరే. ఇప్పుడేమైంది? అసలంటూ మాట్లాడాడు కదా, చాలు. రేపటి గురించి ఇక టెన్షన్ లేదు. ఏరా మాధవా, హ్యాపీనా?' అన్నాడు రాఘవ.
'ఆఁ, అలాంటిదే. మాట్లాడటం మొదలు పెట్టాకా టెన్షన్ అనిపించలేదు. కానీ రేపు అసలు ఏం మాట్లాడాలా అనేదే పెద్ద డౌట్.' చెప్పాను నేను.
'దానిదేముందిరా, ఏళ్ళ తరబడి ఏ టాపిక్కూ లేకుండా మనం మాట్లాడుకోవట్లేదా? టైమ్‌కి ఏదో ఒకటి అదే గుర్తొస్తుందిలే.' అన్నాడు మురళి.
'నాది చెత్త సలహా ఐతే మరి దీన్నేమంటార్రా? నీతో మాట్లాడినట్టుగా ఆ అమ్మాయితో మాట్లాడమంటావా? అసలదెలా కుదురుతుంది? కుదురుతుందని అసలు ఎలా అనుకున్నావు? ఆ అమ్మాయి ఫిలాసఫీ స్టూడెంట్. తెలివైనది. పనికిమాలిన విషయాలు మాట్లాడదు, మాట్లాడితే ఇష్టపడదు. ఫిలాసఫీ అంటే తెలుసారా నీకు? చూసి కాపీ కొట్టడానికి కుదరని ఏకైక ఫీల్డ్‌రా అది. అసలు నువ్వూ, ఆ అమ్మాయి ఒకే టైప్ అని ఎలా అనుకున్నావు? అసలు నీకు వీసా ఎవరిచ్చార్రా?' వచ్చిన అవకాశాన్ని ఏ మాత్రం వదులుకోకుండా మురళిని ఉతికి పారేసాడు మహేష్.
నవ్వాపుకుంటున్న నన్ను, రాఘవని చూసి మొహం మాడ్చుకుని కూర్చున్నాడు మురళి.
ఏది ఏమైనా మహేష్ సలహా పాటించి ఆ అమ్మాయితో ముందుగా మాట్లాడటం మంచిదయిందనిపించింది.రేపు పెద్దగా ప్రాబ్లం ఉండదనే ధైర్యంతో కాసేపు వీళ్ళతో హ్యాపీగా గడిపి త్వరగా పడుకున్నాను.

-: మర్నాడు:-

ఎనిమిదింటికి లేచి, గంటలో నీట్‌గా రెడీ అయ్యాను. వీళ్ళ ముగ్గురిలో ఒక్కడు కూడా లేవలేదు. మహేష్ ఒక్కడే కొంచెం అటూ ఇటూ కదులుతున్నాడు. వాడినే లేపి బయలుదేరుతున్నానని చెప్పాను. పాపం వాడు కారు దాకా వచ్చి ఆల్ ది బెస్ట్ చెప్పాడు.
కారులో త్యాగరాజ కీర్తనల సిడి ఉంది. హాయిగా వింటూ అరగంటలో మహతి వాళ్ళ డార్మిటరీ దగ్గరికి చేరాను. వాళ్ళ డార్మిటరీ ఎదురుగా విజిటర్ పార్కింగ్ స్పేస్ ఒకటి ఉంది. అయినా ఎందుకో తెలియదు, కొంచెం ముందుకి వెళ్ళి కొంత దూరంలో పార్క్ చేసి వెనక్కి నడిచి వస్తూ మహతికి కాల్ చేసాను. ఎలా రిసీవ్ చేసుకుంటుందో, చూడగానే ఎలా రియాక్టవుతుందో, హాయ్ చెప్పాలా, షేక్‌హ్యాండివ్వాలా - ఇలా ఎన్నో డౌట్లు. తను ఫోన్లో మాట్లాడుతూనే బయటకి వచ్చింది. నేను పొరపాటున కూడా ఊహించనట్టుగా పదహారణాల తెలుగు పిల్లలా పరికిణీ కట్టుకుని ఉంది. చూడగానే చెయ్యి ఊపి హాయ్ చెప్పి, ఫోన్లో బై చెప్పి, ఫోన్ పెట్టగానే రెండు చేతులతో నమస్తే చెప్పింది. నేను కూడా ప్రతి నమస్కారం చెప్పాను అప్రయత్నంగానే. తను నేను ఊహించినదానికంటే అందంగానే ఉంది. బహుశా ఫొటో చూడకపోవడంవల్లో లేక ఆ అమ్మాయి ఫిలాసఫీ స్టూడెంటని తెలియడంవల్లో తను పెద్ద అందంగా ఉంటుందని ఊహించలేదు.
ఎదురుగా వచ్చి 'అడ్రస్ ఈజీగానే దొరికిందా?' అని అడిగింది.
'ఆఁ, పెద్ద కష్టమేమీ అనిపించలేదు. కాకపోతే ముందు పక్క డార్మ్ అనుకున్నాను. కార్ పార్క్ చేసాకా చూసాను నంబర్.' అన్నాను. కార్ పార్కింగ్ సంగతి ఎందుకు తెచ్చానో అర్థం కాలేదు.

'యా, ఈ డార్మ్స్ అన్నీ ఒకేలా ఉంటాయి. రండి లోపలకి వెళ్దాం.' అని డార్మ్ లోపలకి తీసుకు వెళ్ళింది. 'మా రూం సెకండ్ ఫ్లోర్‌లో.' అంది పరికిణీ చేత్తో పట్టుకుని మెట్లు ఎక్కుతూ. నేను తనకంటే రెండు మెట్లు కింద ఉన్నాను. అప్రయత్నంగా కాళ్ళకి పట్టీలు పెట్టుకుందేమో అని చూసాను. పెట్టుకున్నట్టు లేదు. అంచనాలు బాగా పెరిగిపోతున్నాయని నన్ను నేనే మనసులో తిట్టుకుని తనని ఫాలో అయ్యాను 'అలాగా' అంటూ.

'నేను మీరు ఒక్కరే ఉంటున్నారనుకున్నాను.'

'లేదండి, ఒక రూమ్‌మేట్ ఉంది. పేరు..' పేరు చెప్తూ తలుపు తియ్యబోయింది. '..దమయంతి' అని గట్టిగా అంటూ సడెన్‌గా తలుపు తీసింది వాళ్ళ రూమ్‌మేట్.

తను చాలా సన్నగా, పొడవుగా ఉంది. నా ఊహాకందనంత పెద్ద కళ్ళజోడు పెట్టుకుని ఉంది. తనను చూసి నవ్వుతూ లోపలకి వెళ్ళి తలుపు పట్టుకుని 'రండి మాధవా' అంది మహతి. నేను దమయంతికి హాయ్ చెప్పి లోపలకి అడుగుపెట్టాను. పైకి నవ్వు పులుముకున్నా లోపల మాత్రం కొంచెం కోపంగా అనిపించింది నాకు. బహుశా ఆ అమ్మాయిని ఇంట్లో ఎక్స్‌పెక్ట్ చెయ్యకపోవడంవల్లనేమో!

లోపలకి వెళ్లి మహతి చూపించిన కుర్చీలో కూర్చున్నాను. ఆ కుర్చీ తలుపుకి ఎదురుగా అవతలి గోడ దగ్గర ఉంది. కుర్చీకి అటూ ఇటూ చెరో గోడ దగ్గర రెండు మంచాలు ఉన్నాయి. నాకు ఎడమ పక్కన ఉన్న మంచం మీద దమయంతి కూర్చుంది. మహతి నిల్చునే 'రెండు నిమిషాలు కూర్చోండి ఇప్పుడే వస్తాను.' అని చెప్పి పక్క గదిలోకి వెళ్ళబోయింది. బ్రేక్‌ఫాస్ట్ తేవడానికని వెంటనే అర్ధమై 'ఇప్పుడేమీ వద్దండి.' అన్నాను. 'లేదండి, కాఫీనే. ఇప్పుడే వచ్చేస్తా. ఈ లోపు దమయంతితో మాట్లాడుతూ ఉండండి. ' అని లోపలకి వెళ్ళింది మహతి.

'నీతోనే ఏం మాట్లాడాలో తెలియట్లేదు, ఇక ఈ అమ్మాయితో ఏం మాట్లాడమంటావమ్మా తల్లీ.' అనుకుని తన వైపు చూసి నవ్వాను. తను కూడా నవ్వి ఊరుకుంది. కాసేపాగి తనే 'నేను మహతి సీనియర్‌ని. తను నా జూనియర్.' అంది. రెండింటి మీనింగ్ ఒకటే కదా అనుకుని నాలో నేను ఒకసారి నవ్వుకుని వెంటనే 'ఓ, అలాగా.' అన్నాను. కొంపదీసి ఆమె మాటల్లో అంతర్లీనంగా వేరే అర్ధం ఏమైనా ఉందా అనిపించి తల దించుకుని ఆలోచించడం మొదలు పెట్టాను. 'మహతి దమయంతి జూనియర్. దమయంతి మహతి సీనియర్. మహతి అలా ఉంది. దమయంతి ఇలా ఉంది. అంటే త్వరలో మహతి దమయంతిలా అవుతుందా? ఓరి నాయనో, ఎలారా దేవుడా!' అనుకుంటూ సడెన్‌గా తన మొహం వైపు చూసాను. చూడగానే ముందు తన కళ్ళజోడు మాత్రమే కనిపించింది. 'ఓ, ఇది ఆ కళ్ళజోడు ఎఫెక్టన్నమాట.' అనుకుని సరిపెట్టుకున్నాను.

'ఈ మంచం మహతిదనుకుంటా.' అనుకుంటూ ఆ రెండో మంచం వైపు చూసాను. దాని మీద రెండు వెండి పట్టీలు ఉన్నాయి. నా అంచనా తప్పు కాదన్నమాట ఐతే అనుకున్నాను వాటిని చూసి ఆనందంగా.

ఐదు నిమిషాలు గడిచాయి. రెండు నిమిషాలంది ఈ పిల్ల ఇంకా రాదేంటబ్బా అనుకుంటూ కుర్చీలో అసహనంగా కదిలాను.

'నేను వెళ్ళి చూసి వస్తాను.' అంటూ లేవబోయింది దమయంతి.

'అబ్బే, వద్దు వద్దు. కూర్చోండి. వచ్చేస్తుంది లెండి.' అని ఇక ఏదో ఒకటి మాట్లాడకపోతే బాగోదు అనిపించి మాట్లాడటం మొదలుపెట్టాను. 'మీ కోర్స్ ఈ సంవత్సరంతో అయిపోతుందా?'

'లేదండి, నేను పిహెచ్‌డి చేస్తున్నా. ఇంకా నాలుగేళ్ళు పడుతుంది.'

'ఫిలాసఫీ అంటేనే ఒక పిహెచ్‌డి మళ్ళీ ఇందులో పిహెచ్‌డి ఏమిటో. ఐనా ఫిలాసఫీకి కోర్సులు, క్లాసులు ఏమిటో. ఫలానా కోర్స్ చదివితే ఒక మనిషి ఫిలాసఫర్ అయిపోతాడని ఎలా చెప్తారో?' ఇలా మళ్ళీ ఆలోచనలు చుట్టుముట్టాయి. అది గమనించిందో ఏమిటోగానీ తను మళ్ళీ మాట్లాడటం మొదలుపెట్టింది. 'జనరల్‌గా ఫిలాసఫీ స్టూడెంట్స్ అంతా పిహెచ్‌డి చేస్తారు. మాస్టర్స్ డిగ్రీలో చేసిన రీసెర్చ్‌ని పిహెచ్‌డిలో కంటిన్యూ చేస్తారు.'

అందరూ అంటే మహతి కూడానా? ఆ ఆలోచన రావడంతోటే భయం వేసింది. కానీ టైం చూసి తననే అడుగుదాంలే అని సరిపెట్టుకున్నా.

ఇంకో రెండు నిమిషాల తర్వాత మహతి వచ్చింది రెండు చేతులతో టిఫిన్ ప్లేటు పట్టుకుని. రెండు చేతులతోటీ పట్టుకుందంటే ఎంత హెవీ టిఫినో అనుకున్నాను.

'అయ్యో, ఎందుకండి పాపం కష్టపడ్డారు? వద్దన్నా కదా.' అందామనుకున్నాను. కానీ తను తెచ్చింది ఇడ్లీలు, అదీ

కారప్పొడి, నెయ్యితోటి. అసలు పొద్దున్నే ఆంధ్రా టిఫిన్ ఎప్పుడు తిన్నానో గుర్తు కూడా లేదు. నిజం చెప్పాలంటే అసలు పొద్దున్నే టిఫిన్ ఎప్పుడు చేసానో కూడా గుర్తు లేదు. లేవగానే అరగంటలో తెమిలి ఆఫీసుకి పరిగెత్తడమే. వచ్చిన అవకాశం వదులుకోవడం ఇష్టంలేక మారు మాట్లాడకుండా తీసేసుకున్నాను. కానీ పాపం ఆ పెద్ద కళ్ళజోడు అమ్మాయికి ఆఫర్ చెయ్యకుండా తింటే బాగోదేమో అనిపించి 'మీరు తీసుకోండి.' అని ప్లేటు తనకి ఇవ్వబోయాను. తను వెంటనే మంచం మీద నుంచి లేచింది. 'వామ్మో, కొంపదీసి తీసేసుకుంటుందా ఏమిటి?' అనుకున్నాను. తను కంగారుగా 'అయ్యో, లేదండి. నేను పొద్దున్నే బ్రేక్‌ఫాస్ట్ చేసేసాను. ఇప్పుడు స్కూల్‌కి బయలుదేరాలి. మీరు తినండి. థ్యాంక్స్ ఫర్ ఆఫరింగ్, ఎనీవే.' అని మహతిని చూసి నవ్వి పక్క గదిలోకి వెళ్ళిపోయింది దమయంతి.

'హమ్మయ్య. ఇడ్లీలు సేఫ్. ప్రైవసీ కూడా దొరికింది. ఇక ఇదయ్యేవరకు దేవుడిని ఏమీ కోరుకోకూడదు.' అనుకుని తినడం మొదలు పెట్టబోయి ఎందుకో మహతి వైపు చూసాను. తను నాకేమైనా కావాలేమో అనుకున్నట్టుంది.

'చేతులు కడుక్కుంటారా? బాత్ రూం చూపించమంటారా.' అంది. గతుక్కుమన్నాను. అసలు నాకు అటువంటి ఆలోచనే రాలేదు. తను ఆ ఇడ్లీలు తెచ్చినప్పటినుండి మెదడంతా తెల్లగా అయిపోయింది. వెంటనే తేరుకుని 'యా, అదే చూస్తున్నా.' అని తనని ఫాలో అయ్యాను. చేతులు కడుక్కుని ఇక లేట్ చెయ్యకూడదు అనుకుంటూ వెనక్కి వచ్చాను. తను తన మంచం మీద నా కుర్చీ వైపు తిరిగి కూర్చుని ఉంది. నా కుర్చీ పక్కన టేబుల్ మీద మంచినీళ్ళు పెట్టి ఉంచింది. హమ్మయ్య, కావల్సినవి అన్నీ వచ్చేసాయి అనుకుని తనవైపు చూసి అడిగాను - 'మరి మీ టిఫిన్ ఏది?'

'లేదండి, నేను మీకు కాఫీకి కంపెనీ ఇస్తాను. మీరు తినండి.'

అంతే, వెంటనే పని మొదలు పెట్టాను.

టిఫిన్ చేస్తూనే ఇండియాలో మా ఫ్యామిలీస్ గురించి, అమెరికాలో లైఫ్ గురించి, యూనివర్సల్ స్టూడియోస్ గురించి, ఈ మధ్య అమెరికాలో రిలీజ్ అయిన తెలుగు సినిమాల గురించి మాట్లాడేసుకున్నాం. తను పూర్తిగా నార్మల్‌గానే మాట్లాడింది. ఇదొక శుభసూచకం అనుకున్నాను.

తినడం మొత్తానికి పూర్తయింది. రాబోతున్న త్రేనుపు బలవంతంగా ఆపుకుని ఈ సారి కూడా చెప్పించుకోకుండా 'చెయ్యి కడుక్కుని వస్తా..' అని లేచాను.

తిరిగి వచ్చేసరికి తను ఒక చేత్తో కాఫీ కప్పు, ఇంకో చేత్తో పాల కప్పు పట్టుకుని ఉంది. రెండూ నాకేనా అని జోక్ చేద్దామనుకున్నా. కానీ నాకే సిగ్గనిపించి 'థ్యాంక్సండీ' అంటూ కాఫీ కప్పు తీసుకున్నాను. 'బాల్కనీలోకి వెళ్దాం రండి.' అంటూ తను వాళ్ళ బాల్కనీ వైపు నడవడం మొదలుపెట్టింది. కాఫీ ఊదుకుంటూ తనని ఫాలో అయ్యాను.

బాల్కనీనుంచి వ్యూ చాలా బాగుంది. బోలెడన్ని చెట్లు, చిన్న రోడ్డు, కొంచెం దూరంలో చిన్న ఫెన్సింగు. ఏదో బొమ్మ గీసినట్టుగా ఉంది. 'వావ్, చాలా బాగుంది.' అన్నాను అప్రయత్నంగా. 'యా, నా సాయంత్రాలు చాలావరకు ఇక్కడే గడుస్తాయి.' అంది తను.

కాసేపు చుట్టూ చూసి కొద్దిగా ధైర్యం తెచ్చుకుని 'చెప్పండి ఫిలాసఫర్ గారు, ఇంకేంటి సంగతులు?' అన్నాను. తను నా వైపు ఆశ్చర్యంగా చూసి 'అయ్యో, నేను ఫిలాసఫర్‌ని కాదండి. ఫిలాసఫీ స్టూడెంట్‌ని మాత్రమే.' అంది చిన్నగా నవ్వుతూ.

మొత్తానికి డిస్కషన్ నాకు కావల్సిన దారి పట్టింది అనిపించింది నాకు. ఇక ఈ అవకాశాన్ని వదులుకోదల్చుకోలేదు.

'ఫిలాసఫీ స్టూడెంట్ అంటే ఫిలాసఫరే కదా.'

'మీరు ఫిలాసఫీ స్టూడెంట్‌ని దృష్టిలో పెట్టుకుని అంటే అంతే. కానీ ఫిలాసఫర్‌ని దృష్టిలో పెట్టుకుని అంటే మాత్రం నేను కాదనే చెప్పాలి.'

తన మొహంలో నవ్వు చెరగలేదు. తన మీనింగ్ అర్థం చేసుకోవడానికి నాకు కొన్ని సెకండ్లు పట్టింది.

'అంటే మీరనేది ప్రతీ ఫిలాసఫరూ ఫిలాసఫీ స్టూడెంటే కానీ ప్రతీ ఫిలాసఫీ స్టూడెంటూ ఫిలాసఫర్ కాదనా?'

'అది ఒక మీనింగ్ అనుకోండి.'

ప్రస్తుతానికి ఈ ఒక్కటీ చాలులే అనుకుని మళ్ళీ మాట్లాడటం మొదలుపెట్టాను టాపిక్ మారిపోకుండా.
'అసలు ఫిలాసఫీ అంటే ఏమిటండి?'
'ఇదేమిటండి సడెన్‌గా? ఫిలాసఫీ గురించి ఇంత ఇంట్రెస్ట్ పుట్టుకొచ్చింది!'
'అబ్బే, అలా ఏమీ లేదు. మీ జీవితంలో అదొక ముఖ్యమైన భాగం కదా. అందుకే తెలుసుకుందామని..'
'మీరు చెప్పమంటే చెప్తానండి. కానీ మీరు నా అభిప్రాయాయల్లో చాలావాటితో ఏకీభవించకపోవచ్చు.'
'ఆ ప్రాబ్లం ఉండదు లెండి. నాకు దేని గురించీ నిశ్చితమైన అభిప్రాయమంటూ ఉండదు.' నోరు జారి నాలుక కరుచుకున్నాను. తను అది జోక్‌లా తీసుకున్నట్టుంది.
'భలేవారే. మీకు తెలుసుగా: మనిషి ఏది వినదామనుకుంటాడో అదే వింటాడు. ఏది వినగలడో అదే విందామనుకుంటాడు. అంటే మీరు నాకు ఒక విషయం చెప్తే, అది నాకు నచ్చకపోతే దానర్థం మీరు చెప్పిన దానిలో నాకర్థమైనది నాకు నచ్చలేదని. ఇంకా, నాకు ఏది అర్థం చేసుకునే కెపాసిటీ ఉందో అదే అర్థమవుతుంది. అంటే మీరు నాకు చెప్పే విషయం గురించి మీకెంత తెలుసు అనే దానికన్నా నాకెంత తెలుసు అనే దాని మీదే మీరు చెప్పేది నాకు ఎంత అర్థమవుతుంది అనేది ఆధారపడి ఉంటుంది. ఒప్పుకుంటారా?'
నేను కొద్దిగా అపస్మారక స్థితిలోకి జారుకోబోయాను. 'ఒప్పుకుంటారా' అన్న పదం తప్ప నాకు ఏమీ అర్థం కాలేదు. అర్థం చేసుకున్నాకే మాట్లాడదామని 'ఒక్క నిమిషం' అని రెండు నిమిషాలు ఆలోచించాను. ఏదో అర్థమయ్యిందనిపించింది.
'అంటే మీరనేది సమాధానం చెప్పేవాడికన్నా ప్రశ్న అడిగేవాడికి ఎక్కువ తెలిసుండాలనా?'
తను నవ్వుతూ 'ఇంచుమించు' అన్నట్టు తలాడించింది. ఇందాక అన్నట్టు ఇది కూడా 'ఒక' మీనింగేమో అనుకున్నాను. కానీ ఒప్పుకోబుద్ధి కాలేదు. 'సమాధానం చెప్పేవాడికంటే ప్రశ్న అడిగేవాడికి ఎక్కువ ఎలా తెలుస్తుంది? తెలిస్తే అసలు ప్రశ్న ఎందుకు అడుగుతాడు? ఇదేమిటి ఇంత సిల్లీగా మాట్లాడింది తను? ఎక్కువ తెలివైన వాడు, తక్కువ తెలివైన వాడిని ప్రశ్న ఎందుకు అడుగుతాడు? ఎంత సింపుల్ లాజిక్! మరి ఇదే ప్రశ్న తనని అడగాలా, వద్దా? అడిగితే ఇందాక తను చెప్పిన దాని ప్రకారం తను చెప్పింది పూర్తిగా అర్థం చేసుకునే కెపాసిటీ నాకు లేదని ఒప్పుకున్నట్టు అవుతుందేమో కదా! దేవుడా, తల పగిలిపోతోంది. అనుకున్నా సరే, అడిగేస్తాను.' వందలాది ఆలోచనలతో బుర్ర వేడెక్కిపోయింది. అయినా సరే ఈ డిస్కషన్ ఆపే ప్రసక్తే లేదనుకుని తనవైపు చూసాను. తను అప్పుడే లోపల నుండి వస్తోంది. ఒక చేతిలో నీళ్ళ జగ్గు, ఇంకో చేతిలో గ్లాసు ఉన్నాయి. భుజం మీద చిన్న టవలు ఉంది. నాకు చాలా ఆశ్చర్యమేసింది. 'తను లోపలకి ఎప్పుడు వెళ్ళింది? అరె, నా చేతిలో కప్పు ఏది? ఇదేమిటి నేను కూర్చుని ఉన్నాను?' మళ్ళీ ఆలోచనలు.
తను మొహం కొంచెం దిగులుగా పెట్టి నీళ్ళ గ్లాసు ఇచ్చింది. ఒక్క గుక్కలో మొత్తం ఖాళీ చేసాను. నీళ్ళు చాలా చల్లగా ఉన్నట్టున్నాయి. తాగేసే దాకా తెలియలేదు. తను గ్లాసు మళ్ళీ నింపింది మాట్లాడకుండా. నీళ్ళన్నీ ఒకేసారి మొహం మీద కొట్టుకుని, గ్లాసు తన చేతికి ఇచ్చి, కళ్ళు తుడుచుకుని, టవల్ తీసుకుని మొహం తుడుచుకున్నాను. సడెన్‌గా చాలా భయం వేసింది. నేను టవల్ తీసింది తన భుజం మీద నుంచి. షాకింగ్‌గా తనవైపు చూసి, 'ఓ గాడ్, ఐ యాం రియల్లీ సారీ.' అన్నాను. తను ఆ సారీ అసలు పట్టిచ్చుకోలేదు. నేను టవల్ తీసిన విషయమే అసలు పట్టించుకున్నట్టు లేదు. తన మొహంలో దిగులు ఇంకా అలాగే ఉంది. అదే దిగులుతో మాట్లాడటం మొదలు పెట్టింది.
'ఏమైంది మాధవగారు సడెన్‌గా? నాకు చాలా కంగారనిపించింది. నేను ఏదో పొరపాటుగా మాట్లాడినట్టున్నాను. ఏమీ అనుకోకండి. మీరు చాలా ఆలోచిస్తున్నారు. నా మాట వినండి. వేరే టాపిక్ మాట్లాడుకుందాం.'
'అయ్యో, అదేమిటండి? నేను బాగానే ఉన్నా. కొద్దిగా ఆలోచించా అంతే. అదీ మీరు చెప్పింది అర్థం చేసుకుందామని. ఈ టాపిక్ ఇంకా అవ్వలేదు కదా. ఇదే మాట్లాడుకుందాం. నా మాట విని అలా కూర్చోండి.'
నేను కూర్చుంటూ తనకి వేరే ఛైర్ చూపించాను. తన మొహంలో అదే దిగులుతో ఆ కుర్చీలో కూర్చుంది.
కాసేపు తన మొహం వైపు చూసి నాలో నేను మాట్లాడుకుంటున్నట్టుగా పైకి అనడం మొదలుపెట్టాను. 'మీరు ఇంకా దిగులుగా ఉన్నారు. మిమ్మల్ని నవ్వించాలంటే ఏం చెయ్యాలబ్బా? ఏదైనా జోక్ చెప్పొచ్చు. జోక్‌కి నవ్వు

రాకపోయినా అది జోక్ అని చెప్పినందుకైనా నవ్వొస్తుందేమో.'
అనుకున్నట్టుగానే ఆ మాటకి తనకి నవ్వొచ్చింది. నవ్వుతూ నావైపు చూసి 'సరే ఐతే.' అంది.
ఒక్క సెకను ఆగి తన మొహంలోకి చూస్తూ అడిగాను: 'ఇప్పుడు చెప్పండి. సమాధానం చెప్పేవాడికంటే ప్రశ్న అడిగేవాడికి ఎక్కువ ఎలా తెలుస్తుంది?'
తను ఒక్కసారి నవ్వి నా మొహంలోకి చూస్తూ అడిగింది: 'ప్రశ్న గురించా? సమాధానం గురించా?'
ఈ ప్రశ్న ఊహించనిది. 'ప్రశ్న గురించా? సమాధానం గురించా?' ఎంత సింపుల్‌గా అడిగింది! ఎందుకో తెలియదు కానీ వినగానే అది మామూలు ప్రశ్న కాదనిపించింది. నా ఇగోని పూర్తిగా పక్కన పెట్టి తన ప్రశ్నకి సమాధానం చెప్పకుండా తనవైపే చూడటం మొదలుపెట్టాను, కుడి చెంప మీద చెయ్యి పెట్టుకుని. నా భావం తనకి అర్థమైనట్టుంది. తనే చెప్పడం మొదలుపెట్టింది.
'నేను మిమ్మల్నొక ప్రశ్న అడిగాననుకోండి. దానికి మీరు చెప్పే సమాధానంతో పాటుగా నేనడిగిన ప్రశ్న గురించి కూడా మీకు పూర్తిగా తెలియాలి. అలానే నాకు నా ప్రశ్న గురించి పూర్తిగా తెలియడంతో పాటు మీరు చెప్పే సమాధానం గురించి కూడా సరిగ్గా తెలియాలి. అప్పుడే నేను సరైన ప్రశ్న అడిగినట్టు, మీరు సరైన సమాధానం చెప్పినట్టు మీకు, నాకు కూడా తెలుస్తుంది. ఇద్దరికీ ప్రశ్న-సమాధానం రెండూ తెలిస్తే అసలు ప్రశ్న అడుగుతున్నది ఎవరు, సమాధానం చెప్తున్నది ఎవరు? ఎవరు ప్రశ్న అడుగుతున్నారు, ఎవరు సమాధానం చెప్తున్నారు అనేదే తెలియనప్పుడు ఎవరికి ఎక్కువ తెలుసు, ఎవరికి తక్కువ తెలుసు అనే ప్రశ్నే ఉండదు కదా!'
నా గుండె చప్పుడు నాకు వినిపిస్తోంది. కనురెప్ప వెయ్యకుండా తన వైపే చూస్తున్నాను. తను మాట్లాడటం కంటిన్యూ చేసింది.
'మాధవ గారు.. ఫిలాసఫీ అంటే ఆలోచించడం. ఫిలాసఫీ అంటే అన్వేషించడం. ఫిలాసఫీ అంటే ప్రశ్నించడం. మనకి తెలిసిన దాని నుంచి ప్రశ్న పుడుతుంది. మనకి తెలియని దాని గురించి ప్రశ్న పుడుతుంది. మనకేది తెలియదో తెలుసుకోవాలంటే మనకేది తెలుసో తెలుసుకోవాలి. ఆ అన్వేషణ సరైన దారిలో సాగాలంటే మనకన్నా ముందు ఆ దారిలో నడిచినవారి అడుగుజాడల్లో నడవాలి, కనీసం కొంత దూరమైనా. ఒక ఫిలాసఫీ స్టూడెంట్ చేసేది అదే. ఆ అన్వేషణ ఫలించిన రోజు, తనకు తెలిసినదంటూ ఏమీ లేదని తెలిసిన రోజు తనలో ఒక ప్రశ్న పుడుతుంది. ఆ ప్రశ్నకి సమాధానం వెతికే ప్రయత్నంలోనే ఆ మనిషి ఫిలాసఫర్ అవుతాడు. లాభనష్టాలకి, కష్టసుఖాలకి, ఆనందాలకి-ఆవేదనలకి అతీతుడు అవుతాడు. మన భగవద్గీతలో చెప్పిన కర్మయోగి అవుతాడు. స్థితప్రజ్ఞుడు అవుతాడు.'
'భర్తా రక్షతి యవ్వనే' అనేది ఈ అమ్మాయి విషయంలో ఎంత తప్పో కదా అనిపించింది నాకు, మాట్లాడటం పూర్తైనట్టుగా మెరుస్తున్న కళ్ళతో నా వైపు చూస్తున్న తనని చూసే సరికి. తను చెప్పింది చెప్పినట్టు అర్థం చేసుకునే సామర్థ్యం నాకింకా లేకపోయినా అర్థమైన ప్రతీదీ అక్షరసత్యం అని మాత్రం అనిపించింది. 'మీరు దేవుడిని చూసారా?' అనే ఒక్క ప్రశ్న వేదాంతపరంగా ప్రపంచాన్ని శాశ్వతంగా మార్చివేసింది. భారతదేశానికి వివేకానందస్వామి వంటి మహనీయుడిని అందించింది. తన మనసులో పుట్టిన ఒకే ప్రశ్నతో ఒక సాధారణమైన మనిషి యోగి వేమన అయ్యాడు. తను అమితంగా ప్రేమించే తన భార్య అడిగిన ఒకే ప్రశ్న నుండి గోస్వామి తులసీదాస్ పుట్టాడు. న్యూటన్ మదిలో పుట్టిన ఒకే ప్రశ్న సైన్స్ కాలచక్రాన్ని గతిలో పెట్టింది. ప్రపంచానికి 'గమన' నియమాలని అందించింది.
తను చెప్పింది ఎంత కరెక్టో కదా! 'ఇది నిజం' అని ప్రపంచం మొత్తం నమ్మిన నమ్మకం కంటే 'ఏది నిజం' అని ప్రశ్నించిన ఒక్క మనిషి స్థైర్యం, ఆ ప్రశ్నని పుట్టించిన అతని తర్కం ప్రపంచం గతిని మారుస్తుంది. ఆలోచిస్తున్న కొద్దీ తను చెప్పిన మాటల అర్థం, ఆ అర్థం వెనక ఉన్న నిజం యొక్క బలం నాకు అర్థమవసాగాయి. తృప్తి నిండిన మనసుతో తనవైపు ఆప్యాయంగా చూసాను. ఆ చూపు అర్థమైనట్టుగా తను ఒక చిరునవ్వు నవ్వి 'హలో ఫిలాసఫర్‌గారు, లంచ్ టైమయింది.' అంది.
'అయ్యో, నేను ఫిలాసఫర్‌ని కాదండి. ఫిలాసఫీ స్టూడెంట్‌ని మాత్రమే.' అన్నాను నవ్వుతూ.
తను కూడా నవ్వుతూ 'రండి. లంచ్ చేద్దాం.' అని లోపలకి నడిచింది.

'ఒక్కసారి చేతులు కడుక్కోవాలి.' అని ముందు జాగ్రత్తగా ముందే చెప్పి తనని ఫాలో అయ్యాను. లంచ్ ఎంతో సరదాగా గడిచింది. వాళ్ళ క్లాస్‌మేట్ల గురించి, ప్రొఫెసర్ల గురించి, నా ఫ్రెండ్స్ గురించి, పొద్దున్నే లేచి ఆఫీసుకి వెళ్ళడానికి నేను పడే తంటాల గురించి చాలా మాట్లాడుకున్నాం. కానీ పెళ్ళి గురించి గానీ, ఒకళ్ళకొకళ్ళు నచ్చామో లేదో అన్న విషయం గురించి గానీ అసలు మాట్లాడుకోలేదు. కానీ ఏం జరగబోతోందో ఇద్దరికీ తెలుసు. 'ఫిలాసాఫికల్ అండర్‌స్టాండింగ్' అంటే బహుశా అదేనేమో.
సాయంత్రం నాలుగవుతోంది. ఇక బయలుదేరే టైం వచ్చింది. కాసేపు ఉండమని అడిగింది. నాకూ ఉంటే బాగుంటుందనిపించింది. అలా అనిపించగానే కళ్ళ ముందు చీపురుకట్టతో మహేష్ కనిపించాడు. వాడిని భరించడం నా వల్ల కాదనుకుని బయలుదేరతానని చెప్పి లేచాను. తను ఇప్పుడే వస్తానని పక్క గదిలోకి వెళ్ళి చిన్న గిఫ్ట్ ప్యాక్ పట్టుకుని వచ్చింది. థ్యాంక్స్, సారీ రెండూ చెప్పి ఆ గిఫ్ట్ తీసుకున్నాను.
'దమయంతిగారికి చెప్పి వెళ్దామనుకున్నాను.' అన్నాను తనతో రూం తలుపు తియ్యబోతూ. 'చెప్పండి.' అంటూ తలుపు తీసింది దమయంతి అప్పుడే స్కూల్ నుండి వస్తూ. తనవైపు నవ్వుతూ చూసి 'వెళ్ళొస్తానండి. నైస్ మీటింగ్ యూ.' అన్నాను. ఇప్పుడు తన కళ్ళజోడు కనిపించడంలేదు నాకు. ఆ కళ్ళజోడు వెనక ఉన్న కళ్ళలోని ప్రశాంతత కనిపిస్తోంది. తను నవ్వుతూ తలాడించింది.

-:కారు దగ్గరికి:-

పరికిణీ చేత్తో పట్టుకుని మెట్లు దిగుతోంది మహతి. తన పట్టీలకున్న మువ్వలు చిన్నగా శబ్దం చేస్తున్నాయి. ఆనందంగా ఆ శబ్దం వింటూ, మెట్ల సంఖ్య తగ్గిపోతున్నందుకు మనసులో బాధ పడుతూ తనతో పాటే నేనూ దిగసాగాను.
డార్మ్ బయటకి వచ్చి ఒక్క సెకను నిల్చొని ఒకరి మొహం ఒకరు చూసుకున్నాం. ఎదురుగా ఉన్న పార్కింగ్‌లాట్‌లో విజిటర్ స్పేస్ ఇంకా ఖాళీగానే ఉంది. కొంచెం దూరంగా పక్క డార్మ్‌కి ఎదురుగా నా కారు కనిపిస్తోంది. కారు వైపు చూపిస్తూ 'నా కారు అక్కడ పార్క్ చేసాను.' అన్నాను.
'నాకు తెలుసు.' అంది తను చిరునవ్వుతో.
కార్లో కూర్చుని, విండో కిందికి దించి తన వైపు చూసాను. తను చేతులు కట్టుకుని నిలబడి ఉంది. షేక్‌హ్యాండ్ కోసం నా కుడి చెయ్యి తనవైపు చాపాను. తను షేక్‌హ్యాండిస్తూ 'నాలుగు గంటల పదహారు నిమిషాల ఇరవై సెకన్లు.' అంది. నేను నవ్వుతూ 'ఆగష్టు ఇరవై, రెండువేల ఆరు సాయంత్రం.' అని చెయ్యి ఊపి బయలుదేరాను.

ఇంటికి చేరేసరికి ముగ్గురూ మా అపార్ట్‌మెంట్ బయట ఎదురు చూస్తున్నారు. 'సాదరంగా' లోపలకి తీసుకువెళ్ళడానికేమో అనుకుని నాలో నేను నవ్వుకున్నాను.
కారు దిగగానే మహేష్ అందుకున్నాడు. 'ఒరే, ఒక్క ప్రశ్నకి సమాధానం చెప్పు, మీటింగ్ ఎలా జరిగిందో నేను చెప్తాను: ఫిలాసఫీ అంటే ఏమిటి?'

~శుభం~
14 జనవరి 2006